ఇంకొక ముఖ్యమైన విషయము చెప్పి ఈ ప్రకరణం ముగిస్తాను. ఇల్లాగ చిల్లర అప్పులు చేసేవాళ్ళు తమవద్ద ఖరీదైన వస్తువులేమీ అట్టి పెట్టుకోకూడదు. బంగారపు ఉంగరాలు, ఖరీదైన ఉత్తరీయాలూ నీవద్ద ఎప్పుడూ ఉండకూడదు. ఒక లావుపాటి చేతికఱ్ఱ పట్టుకొని తిరుగుతూ ఉండడము ఎందుకైనా మంచిది. దానితో ఎప్పుడు ఏమి అవసరము వస్తుందో చెప్పలేము కదా!

ఉన్న ఊళ్ళో ఇల్లాగ చేతనైనంతవరకు అప్పు చేసి, ఇంతవరకూ సూచించిన మార్గముల ననుసరించి వాటిని తీర్చడము జరిగిన తరువాత ఇక ఆ ఊళ్లో ఉండి ప్రయోజనము లేదు. వెంటనే మరో ఊరికి బదిలీ చేయించుకొని ఆ వూళ్లో మొదలు పెట్టి మళ్ళీ ఈ వ్యాపారం సాగించడము ఎంతైనా ఉత్తమము!

## 8. ధర్మసూత్ర నిరూపణ

అప్పుచేసే పద్ధతులను గురించీ సక్రమంగా ఆ అప్పులను తీర్చ వలసిన బాధ్యతను ప్రతివాడూ గుర్తించి ఏ విధంగా తీర్చవలెనో ఆ విషయాన్ని గురించీ సమగ్రంగా పరామర్శ చేసినాను. ఇక ఒక్క విషయము చెప్పి ఈ పుస్తకం ముగిస్తాను. ఆ విషయము ఇదివరళ్లో చెప్పినదే అయినా అది చాలా ప్రాముఖ్యంగల విషయము కాబట్టి మరొకసారి నొక్కి వక్కాణించదలచు

కొన్నాను. ఏమిటీ అంటే, మనము ఒకరికి ఒకమొత్తము, చిన్నది గాని పెద్దది గాని, బాకీ పడ్డ తరువాత, ఆ బాకీ విషయమై బొత్తిగా మరచి పోవడము వలననే ఆ ఋణము పూర్తిగా తీరిపోతుందన్న ధర్మసూత్రము యొక్క ప్రాముఖ్యమును వివరించు నట్టి రెండు కథలు ఇక్కడ చెప్పదలచినాను. ఆ కథలలోని వ్యక్తులు తమ బాకీల విషయమై వీలువెంట మరచిపోయి ఏ విధంగా ఋణ విముక్తులు అయినారో గుర్తించ వలసి ఉన్నది.

కోర్టులో నుంచి ఒక ముఖ్యమైన కాగితం నీకు కావలసి నీవు తత్ సంబంధమైన గుమాస్తా దగ్గరకు వెడతావు. అతడు ఏమంటాడు ?

"చూడండి మీకు కావలసిన డాక్యుమెంటు నేను ఎల్లాగో కష్టపడి సంపాదించి పెడతానుగాని మీరు నాకొక సహాయం చేయవలె... ఒక యాభై రూపాయలు అత్యవసరంగా కావలసి వచ్చింది. మీరు నాకు ఉచితంగా ఏమీ ఇయ్యనక్కరలేదు సుమండీ! ఇచ్చినా నేను పుచ్చుకోను! మళ్లీ మీకు ఆ సొమ్ము వారం పది రోజులలో ఇచ్చివేస్తాను నూటికి ఆరు చొప్పున వడ్డీ ఇయ్యటానికి కూడా అభ్యంతరము ఏమీలేదు. కాస్త చేబదులుగా ఇప్పించండి."

నీకు అతనితో పని ఉన్నది. కాదన లేవు. ఇచ్చి వేస్తావు. ఈ విధంగా ఆ గుమాస్తా నీకు యాభై రూపా

యలు బాకీ పడినాడు. అతడు నీ బాకీ ఏ విధంగా తీరు స్తా డన్నదే మనకు ప్రకృతము కావలసిన విషయము.

ఆ గుమాస్తా ఆ బాకీని ఎట్లా తీరుస్తాడో తెలుసునా? ఆ విషయమై పూర్తిగా మరిచి పోతాడు. దాంతో ఆ బాకీ తీరి పోతుంది.

ఆ డబ్బు ఇయ్యమని నీవు మళ్లీ అడగవు. ఏదో సాహాయ్యము చేసినాడు గదా పోనీలే అని ఊరుకొంటావు. ఆ సంగతి అతనికీ తెలుసు! అందుకనే అతడు ఈ విషయమై చాలా త్వరితముగా మరిచి పోగలుగుతాడు.

ఇంతకూ నేను చెప్ప దలచు కొనిన విషయము ఏమిటీ అంటే, ఎక్కడైతే నీవు చేసిన బాకీ మర్చిపోవడానికి అవకాశము ఉన్నదో, అక్కడల్లా చటుక్కున మరిచి పోవడమే కర్తవ్యము కాని, అంతరాత్మ బాధిస్తుందనీ, మర్యాద కాదనీ ఇటువంటి పిచ్చి పిచ్చి ఊహలకు తావు ఏ మాత్రమూ ఇయ్యకూడదు.

తమ వద్దకు ఏదైనా పని ఉండి వచ్చిన ఆ సామీలతో సాధారణంగా అధికారులు ఇట్లా అంటూ ఉంటారు. "చూడండి, మీా గ్రామములో మంచి కందులు దొరుకుతవి అని విన్నాను. ఒక బస్తా తోలి పెడతారూ? ఆ బండి మనిషికే చీటీ ఇచ్చి పంపండి. ఆ బస్తా కందులకు ఎంత ఇయ్యవలెనో తెలియ జేయండి. డబ్బు వాడి చేతికిచ్చి పంపిస్తాను."

అవతల పెద్దమనిషి "అల్లాగే నండి శ్రమకు ఖరీదు ఇవ్వాలటండీ ?" అంటాడు మర్యాదకు.

ఆ మాటలు విని అధికారి కోపం వచ్చిన వాడి లాగ ముఖం పెట్టి, "అల్లా కాదంటోయ్. డబ్బు పుచ్చుకోకపోతే నేను ఊరుకోను. ఇక్కడ మంచి కందులు దొరక్క మిమ్మల్నను అడుగుతున్నానుగాని కొనుక్కోలేక కాదు. మీ కేమైనా ఊరికే వచ్చినవా! ఒకవేళ మీ పొలంలో పండినవే అనుకోండి, అయితే మటుకు ధర పుచ్చుకోకపోతే నేను ఒప్పుకుంటానా! అదంతా వీలులేదులెండి. కందులు మటుకు పంపండి. ధర పుచ్చుకోండి." అంటాడు.

దాని తరువాత కందుల బస్తా వస్తుంది. చీటీ కూడా పంపిస్తాడు. అధికారి కందులబస్తా ఇంట్లో వేయించుకొని, "డబ్బు పంపిస్తానన్నానని చెప్పు" అంటాడు.

అంతే. దాని తరువాత ఆ విషయము ఆయనకు జ్ఞాపకం ఉండదు. ఎట్లా జ్ఞాపకం ఉంటుంది; గొప్ప అధికారి ఆయె! ఆ ఆసామి పనిగట్టుకొని వచ్చి అడుగనూ అడుగడు. అడుగడని ఈయనకు తెలియనూ తెలుసు! కాబట్టే ఆ విషయము తొందరగా మరిచి పోవడము సంభవము అవుతుంది.

మళ్లీ ఆ ఆసామి ఆ అధికారిని కలుసుకొన్నా ఈ కందులబస్తా సంగతి ఎత్తడు. ఈయనా ఎత్తడు. ఆ బాకీ ఎప్పుడో తీరిపోయిందన్న మాట!

అయితే కొందరు గడసరులైన అధికారులుంటారు. వారు ఆ ఆసామి కనుపించి నపుడు కొంత సంభాషణ అయిన తరువాత "చూశారా, ఇప్పుడు మిమ్ములను చూస్తే జ్ఞాపకం వచ్చింది! మీకు ఆ కందుల బస్తా ఖరీదు ఇవ్వనే లేదు కామాలు! పోనీ నాకు జ్ఞాపకం లేకపోతే మీరైనా జ్ఞాపకం చెయ్యవద్దుటండీ? నేను ఈ ఆఫీసు పనితో మునగానాం. తేలానాం గా ఉంటాను. చూశారూ, మీరు అల్లాగ ఎప్పుడూ చేయకండేం! ఇదే చెప్పడము! రేపు వచ్చే ఫస్టు తారీఖునకు వచ్చి సొమ్ము అడిగి పట్టుకెళ్ళండి" అంటాడు. దాని తరువాత ఆ విషయం మళ్ళీ మరిచి పోతాడు. మరిచి పోతానని ముందుగానే చెప్పినాడాయె! ఆయన తప్పేముంది ఇందులో!

ఇల్లాగనే కొందరు అధికారులు తమ దగ్గర గుమాస్తాలుగా ఉన్న వారి వద్ద అయిదూ పదీ అప్పుగా పుచ్చుకొని మరిచిపోతూ ఉంటారు.

అప్పు జేసిన మొత్తమును తిరిగి ఇచ్చేవాడు అధముడు. ఇస్తానంటూ కాలం గడిపేవాడు మధ్యముడు. అప్పు తెచ్చిన మరుక్షణం లోనే ఆ విషయమును పూర్తిగా మరువ గలిగిన వాడు ఉత్తముడు.